# లక్ష్యం, వ్యక్తిత్వం ముఖ్యం

**▸▸ వికాస్ సాధికారత సదస్సులో గుంటూరు సీఐడీ అదనపు ఎస్పీ సరిత**




సదస్సులో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ సరిత, వేదికపై వికాస్ ఛైర్మన్ నర్సిరెడ్డి, కీర్తి

**నున్న (విజయవాడ రూరల్), జనవరి 5 :** ప్రతి ఒక్కరికీ లక్ష్యం, వ్యక్తిత్వం ముఖ్యమని, సమాజం అంతా సంతోషంగా ఉండాలనే ప్రతి ఒక్కరూ కోరుకోవాలని గుంటూరు సీఐడీ అదనపు ఎస్పీ కె.జి.వి సరిత అన్నారు. నున్నలో వికాస్ విద్యాసంస్థలు, లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో యువత - మహిళలు -సాధికారత అనే అంశంపై కళాశాలలో శనివారం సదస్సు జరిగింది. ఈ సదస్సుకు వికాస్ విద్యాసంస్థల ఛైర్మన్ నరెడ్ల నర్సిరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సరిత మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉండాలనే ఆలోచనా ధోరణిని ప్రతి ఒక్కరూ అలవరచుకోవాలన్నారు. రాజ్యాంగంలో ఆర్టికల్ 14 ప్రకారం అందరూ సమానమేనని, కానీ, ఆర్టికల్ 15, 16 ప్రకారం మహిళలు, సీనియర్ సిటిజన్స్‌ను మరింత ప్రోత్సహించాలన్నారు. సమాజంలో పురుషులతో సమానంగా మహిళలు రాణిస్తున్నారని, ఇస్రో శాస్త్రవేత్తలలో మహిళా శాస్త్రవేత్తలు ఎక్కువ మంది ఉండటమే ఇందుకు నిదర్శమన్నారు. అయితే, మహిళలపై నేరాలు పెరగటంపై ఆమె ఆందోళన వ్యక్తం చేశారు.

జీవిత లక్ష్యాన్ని సాధించే క్రమంలో అనేక ఒత్తిళ్లు ఎదురవుతాయని, అలాంటపుడు ఒక్కసారి ఆలోచన చేస్తే చాలా మంది ఆత్మహత్య నిర్ణయాన్ని వాయిదా వేసుకుంటారన్నారు. ఇలాంటి ఆలోచనా విధానాన్ని కూడా పెంపొందించుకోవాలని సూచించారు. ఆలోచనా విధానాన్ని మార్చుకుంటే తప్ప రాణించలేరని పేర్కొన్నారు. నేరాలు జరిగినపుడు ఒకరు బాధకు గురవుతారని, అలాగే నేరస్తునికి శిక్ష పడినపుడు వారి కుటుంబ సభ్యులు కూడా బాధపపడతారన్నారు. న్యాయం చేయటం ద్వారానే సమాజంలో మార్పు రాదని, నేరం జరగకుండా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని మంచికే వినియోగించుకోవాలన్నారు. ఒక పని చేయటం ద్వారా కలిగే నష్టం సమాజంపై ప్రభావం చూపకుండా ఉండాలనే, అదే మంచి వ్యక్తిత్వానికి నిదర్శనమన్నారు. యువత, మహిళలు స్వీయ నిర్ణయం తీసుకునేస్థాయికి ఎదిగినపుడే సాధికారిత సాధించినట్లవుతుందని చెప్పారు. వికాస్ విద్యాసంస్థల ప్రతినిధి నరెడ్ల కీర్తి మాట్లాడుతూ విద్యార్థులు అందుబాటులో ఉన్న సమాచారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వికాస్ విద్యాసంస్థలలోనే చదువుకున్న తాను, అమెరికాలో ఉన్నత విద్యాభ్యాసం చేస్తూ, సాధికారిత సదస్సులో మాట్లాడటం అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ గవర్నర్ ఏ కోటిరెడ్డి, నున్న క్లబ్ అధ్యక్షుడు గుంటక హనుమారెడ్డి, వికాస్ ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ రామ్మోహన్ విద్యార్థునులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి Sun, 06 January 2019
https://epaper.andhrajyothy.com/c/35529313

# స్త్రీ విద్య ఎంతో అవసరం



మాట్లాడుతున్న సరిత

**నున్న (విజయవాడ గ్రామీణ), న్యూస్‌టుడే :** విద్యార్థులు సాధికారిత సాధికారత సాధించాలని, స్త్రీలకు విద్య ఎంతో అవసరమని గుంటూరు జిల్లా అడిషనల్ సూపరింటెండెంట్ కె.జి.వి సరిత అన్నారు. నున్న వికాస్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం మహిళలకు అవగాహన అనే అంశంపై కార్యశాల నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆనందం, దుఃఖం సమానంగా స్వీకరించినప్పుడే జీవితంలో ఉన్నతస్థాయికి వెళ్లగలమన్నారు. ప్రతి విషయాన్ని ప్రశాంతంగా స్వీకరించే శక్తి ఉండాలన్నారు. సమాజంలో నేరాలు పెరగడానికి కారణం సాంకేతిక పరిజ్ఞానాన్ని పరిమితికి మించి వినియోగించడమేనని చెప్పారు. చెడు భావవ్యక్తీకరణను మంచిగా మార్పు చేసుకుని విజయం సాధించాలన్నారు. ఎంచుకున్న లక్ష్యంపై స్పష్టత ఉండాలని, చదువుతున్న అంశాలపై పట్టు సాధించాలన్నారు. స్త్రీకి చదువు అవసరమని గ్రహించి సావిత్రి బాయి పూలే 10 మంది విద్యార్థినులతో విద్యా సంస్థ ప్రారంభించారని, నేడు మహిళలు ఎంతో ప్రగతి సాధించారని పేర్కొన్నారు. విధి నిర్వహణలో ఎదుర్కొన్న వివిధ రకాల కేసులు, అనుభవాలను పంచుకున్నారు. కార్యక్రమంలో ఛైర్మన్ నరెడ్ల నర్సిరెడ్డి, ప్రిన్సిపాల్ బి రమణ, బి రామ్మోహనరావు, ఎస్ కిశోర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు సానుకూల దృక్పథాన్ని పెంచుకోవాలి




**సెమినార్‌లో మాట్లాడుతున్న కేజీవీ సరిత**

## గుంటూరు ఏసీపీ సరిత

నున్న (విజయవాడ రూరల్): విద్యార్థులు సానుకూల దృక్పథాన్ని పెంచుకోవాలని గుంటూరు అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీసు కేజీవీ సరిత సూచించారు. నున్న వికాస్ ఇంజినీరింగ్ కాలేజీలో లయన్స్ క్లబ్ ఆఫ్ నున్న ఆధ్వర్యంలో శనివారం ఉమెన్ అవేర్‌నెస్ అనే అంశంపై సెమినార్ జరిగింది. ఈ సందర్భంగా సరిత మాట్లాడుతూ విద్యార్థులు తమలో ఉన్న నెగిటివ్ ఫీలింగ్స్‌ని పాజిటివ్‌గా మార్చుకొని జీవితంలో విజయం సాధించాలన్నారు. చదువుకున్న అంశాలపై పట్టు సాధించాలని చెప్పారు. స్త్రీకి విద్య ఎంతో అవసరమని గ్రహించి సావిత్రిభాయి పూలే 10 దిమంది విద్యార్థినులతో ఓ విద్యా సంస్థను ప్రారంభించారని, అది నేడు మహావృక్షంలా విస్తరించిందన్నారు. తన సర్వీసులో ఎదుర్కొన్న వివిధ రకాల కేసులకు సంబంధించిన అనుభవాలను ఆమె విద్యార్థులతో పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ ఎన్. నర్సిరెడ్డి, కుమారి ఎన్. కీర్తి, ప్రిన్సిపాల్స్ డాక్టర్ బి.రమణ, డాక్టర్ బి రామ్మోహనరావు, ప్లేస్‌మెంట్ అధికారి కిషోర్‌బాబు పాల్గొన్నారు.

Sun, 06 January 2019
https://epaper.sakshi.com/c/35529161